

సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, వేదికపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మెన్ తాహెర్, ఇతర నాయకులు

జిల్లా అభివృద్ధే లక్ష్యం

ప్రతి శాఖలో మార్పు రావాలి ✦ సమీక్ష సమావేశంలో జిల్లా మంత్రి జూపల్లి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యంపై చర్చించారు. ప్రతి శాఖలో మార్పు కనిపించేలా పాలన ఉండాలన్నారు. అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నామని, సాంకేతిక కారణాలతో కొందరికి కాలేదని, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి ఇబ్బందులు తొలగిస్తున్నారని తెలిపారు. ఏకకాలంలోనే చేయాల్సి ఉన్నా గత ప్రభుత్వ చేసిన అప్పుల వడ్డీలకే సరిపోతుందని.. అందుకే మూడు దశల్లో ఇవ్వాల్సి వచ్చిందని విలేకరి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సీజన్‌లో 505 కొనుగోలు కేంద్రాలు నెలకొల్పనున్నట్లు చెప్పారు. ప్రతి పాఠశాల, కళాశాలలో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన బోధన అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు తనిఖీలు చేస్తే సమస్యలు తెలుస్తాయన్నారు. పాఠశాలల రేషన్‌లైజేషన్ వారం రోజుల్లో పూర్తి చేయాలని డీఈవోను ఆదేశించారు. మంజూరు చేసిన నిధుల్లో సగం విద్య, వైద్య రంగాలకు వెచ్చించాల్సిన అవసరం ఉందన్నారు. డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ ఛైర్మెన్ మార గంగారెడ్డి, డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మన్లు రమేశ్‌రెడ్డి, తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్, మేయర్ నీతూ కిరణ్, నగర కమిషనర్ మకరందు, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఇంజినీరింగ్ కళాశాల అంశం

నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశామని, తెలంగాణ వర్సిటీకి అనుబంధంగా మరో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు.

ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డితో ఆసక్తికర చర్చ

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్మూర్ డిపో స్థలంలోని షాపింగ్ మాల్‌తో ఆర్టీసీ సంస్థకు ఆదాయం వస్తున్నందున కొత్త బస్సులు వేయాలని కోరారు. ఆర్మూర్ పట్టణంలో ట్రాఫిక్ ఠాణా మంజూరు చేయాలని విన్నవించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల బకాయిలు చెల్లించాలన్నారు. సమస్యలు చెప్పుకొనేందుకు మంత్రి లేరని, సుదర్శన్‌రెడ్డికి పదవి ఇస్తే బాగుంటుందన్నారు. మీ సమస్యలు విని సమాధానాలు చెప్పాలంటే గంట సమయం పడుతుందని మంత్రి నవ్వుతూ సమాధానం ఇచ్చారు.



హాజరైన వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు

నిజామాబాద్ - వర్ని రోడ్డు పనులకు శంకుస్థాపన

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: ఎస్సీ ఎస్టీఎఫ్ నిధులు రూ.4.50 కోట్లతో నిర్మించనున్న నిజామాబాద్ - వర్ని రోడ్డు పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.6 కోట్లతో నిర్మించనున్న నిజామాబాద్-నర్సి రోడ్డు పనులను సైతం ప్రారంభించారు.

అలరించిన కళార్చన

జిల్లాకేంద్రం సుభాష్‌నగర్ జ్ఞానసరస్వతి ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో సోమవారం నిర్వహించిన కళార్చన ప్రదర్శన అలరించింది. కర్ణాటక, హిందుస్థానీ గాత్రంలో పాటలు పాడి, పేరిణీ నృత్యం చేసి విద్యార్థులు ఆకట్టుకున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కిన స్వప్నరాణిని సత్కరించారు. ప్రిన్సిపల్ రవీందర్‌రాజు అనిత, జయప్రద పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం



కొత్త ఉపాధ్యాయులొస్తున్నారు

- డీఎస్సీ ఫలితాలు విడుదల
- 1:3 ప్రకారం ధ్రువపత్రాల పరిశీలనకు పిలుపు

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం


కొన్నేళ్లుగా ఉపాధ్యాయ నియామకాలు లేవు. ప్రభుత్వ బడులను నమ్ముకొని పిల్లల్ని పంపితే సరైన బోధన అందక నష్టపోతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం డీఎస్సీ ఫలితాలు వెల్లడించారు. త్వరలో నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరడం ద్వారా సర్కారు బోధన బలోపేతమవుతుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక గత డీఎస్సీ ప్రకటనకు మరిన్ని జతచేసి మార్చి 1న జిల్లాలో 601 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేశారు. జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు మొదటిసారిగా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. 55 రోజుల్లోనే 1:3 నిష్పత్తి ప్రకారం ఫలితాలు విడుదల చేశారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

1:3 పద్ధతిలో ఎంపికైన అభ్యర్థులకు డీఎస్సీ ఫలితాలు తమ చరవాణులు, ఈమెయిల్‌లకు సంక్షిప్త సమాచారం అందిందని, ఆయా అభ్యర్థులు ఈ నెల 1 నుంచి 5వ తేదీల్లో జిల్లా కలెక్టరేట్‌లోని రూం నెం. 103లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. నిజ ధ్రువపత్రాలతో పాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన రెండు జిరాక్స్ సెట్లు వెంట తెచ్చుకోవాలన్నారు. వెబ్‌సైట్ నుంచి పరిశీలన పత్రం డౌన్లోడ్ చేసుకొని వివరాలు పూరించి తీసుకురావాలని సూచించారు.

2008 డీఎస్సీ వారు సైతం..

బుధవారం(2వ తేదీ) నుంచి అన్ని బడులకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించినందునా.. 5వ తేదీలోపు ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసి ఈ నెల 9న ఎంపికైన వారికి నియామకపత్రాలు పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. దసరా సెలవుల తర్వాత ఎంపికైన వారు కేటాయించిన పాఠశాలల్లో చేరనున్నారు. వీరితో పాటు 2008 డీఎస్సీలో నష్టపోయిన వారికి ప్రభుత్వం ఈ ఏడాది ఒప్పంద పద్ధతిలో నియమించేందుకు సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లాలో ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. మొత్తం 240 మంది నష్టపోగా... పలువురు ఇప్పటికే ఇతర ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారని, ఇప్పటి వరకు ధ్రువపత్రాల పరిశీలనకు 120 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ స్పష్టం చేసింది. నూతన డీఎస్సీ అభ్యర్థులతో పాటు మరో 120 మంది ఉపాధ్యాయులు ప్రభుత్వ బడుల్లో బోధించేందుకు దసరా తర్వాత అందుబాటులోకి రానున్నారు.



కేటగిరీల వారీగా.. ఖాళీలు


స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ) : 124
సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) : 403
భాషా పండితులు : 23
వ్యాయామ ఉపాధ్యాయులు : 9
ప్రత్యేక కేటగిరీ (ఎస్ఏ) : 11
ప్రత్యేక కేటగిరీ (ఎస్జీటీ) : 31
మొత్తం : 601

మొదటి స్థానం వీరిదే..

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఇదివరకే ఇతర ఉద్యోగాలు సాధించిన వారు ఉత్తమ మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. ఎస్జీటీ తెలుగు మాధ్యమంలో జి.దత్తాత్రి, ఉర్దూ మాధ్యమంలో బి.బషీర్ టాపర్లు కాగా, పలువురు స్కూల్ అసిస్టెంటు విభాగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలిచారు.



- **పేరు:** ఎన్.సన్నిత్
- **ఊరు:** సీతారాంనగర్ కాలనీ
- **మండలం:** నిజామాబాద్
- **ర్యాంకు:** 1
- **వచ్చిన మార్కులు:** 84.83
- **పోస్టు:** స్కూల్ అసిస్టెంటు, గణితం
- **ఎలా సన్నద్ధమయ్యారు:** 2023 జనవరి నుంచి సన్నద్ధమయ్యారు. శిక్షణ తీసుకోకుండానే ప్రత్యేక నోట్ రాసుకొని చదివారు. ఇటీవల గురుకుల టీజీటీ పోస్టు రావడంతో ధర్మారం(బి) అర్బన్ గురుకులంలో పనిచేస్తూనే డీఎస్సీ రాశారు. గ్రూప్-4లో 24వ స్థానం, ఏకలవ్య గురుకుల ఉపాధ్యాయుడిగానూ ఎంపికయ్యారు.



- పి.సాయిలు
- ధర్మారం(ఏ)
- నవీపేట
- 1 ✤ 75.13
- స్కూల్ అసిస్టెంటు, సాంఘిక శాస్త్రం ▼ రెండేళ్లుగా శిక్షణ లేకుండానే సొంతంగా చదువుకున్నారు. గురుకుల పీజీటీ, టీజీటీగా ఎంపికయ్యారు. గ్రూప్-4 ఉద్యోగం సాధించారు. గ్రూప్-1 మెయిన్స్‌కూ అర్హత సాధించారు. ప్రస్తుతం సాంఘికశాస్త్రం (ఎస్ఏ)లో జిల్లా టాపర్‌గా నిలిచారు.



- ఎల్.వికాస్ ● వినాయక్ నగర్ ■ నిజామాబాద్
- ★1 ✤ 74
- ✦ స్కూల్ అసిస్టెంటు, హిందీ
- ▼ ఇంటర్‌లో ఉన్నప్పుడు తండ్రి చనిపోవడంతో కుటుంబానికి వెన్నుదన్నుగా ఉంటూ పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ దూరవిద్యలో డిగ్రీ చేశారు. బీఈడీ పూర్తి చేసి గతేడాది ధర్మారం(బీ) గురుకులంలో టీజీటీ ఉద్యోగం సాధించారు. డీఎస్సీ కోసం రెండేళ్లుగా సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.



- ఏ.రాకేశ్
- ● సుద్దపల్లి ■ డిచ్‌పల్లి
- ★1 ✤ 66.5 (పీఈటీ), 61.5(పీడీ) ✦ పీఈటీ, పీడీ
- ▼ రెండేళ్ల నుంచి సొంతంగా సిద్ధమవుతున్నాను. గురువు రాజారావు, తల్లిదండ్రులు, సోదరుడి సహకారం ఎంతో ఉంది. పీఈటీ, పీడీ రెండు విభాగాల్లోనూ జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం గర్వంగా ఉంది.



- జి.దత్తాత్రి
- ● కల్లూర్
- ■ పోతంగల్
- ★1 ✤ 84.63
- ✦ ఎస్జీటీ, తెలుగు మాధ్యమం
- ▼ 2016లో శిక్షణ తీసుకున్నప్పటికీ ఉద్యోగం రాలేదు. 2022 ప్రకటన రావడంతో గ్రామంలోనే ప్రత్యేక గది తీసుకొని ప్రిపేరయ్యా. అన్నయ్య శివరాజ్ 20 ఏళ్లుగా కుటుంబ బాధ్యతలు భుజాన వేసుకొని ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ నన్ను చదివించారు.

గ్రామాల్లో ఆధిపత్యం ఆమెదే..

27 మండలాల్లో మహిళా ఓటర్లు అధికం

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

మండలం	పురుషులు	మహిళలు
ఆర్మూర్	19,934	23,548
బాల్కొండ	11,610	13,581
భీమ్‌గల్	17,654	20,534
బోధన్	22,988	24,841
చందూరు	4,200	4,523
ధర్పల్లి	14,549	16,744
డిచ్‌పల్లి	21,083	24,303
ఇందల్‌వాయి	13,962	16,112
జక్రాన్‌పల్లి	15,858	18,468
కమ్మర్‌పల్లి	13,504	15,773
కోటగిరి	19,096	20,845
మాక్లూర్	18,460	21,761
మెండోరా	9,511	11,112
మోర్తాడ్	12,404	14,533
మోస్రా	4,821	5,413
మోపాల్	13,756	16,179
ముప్కాల్	7,334	8,572
నందిపేట	26,726	31,438
నవీపేట	21,382	24,521
ని.రూరల్	10,011	11,230
రెంజల్	13,961	15,151
రుద్రూరు	8,088	8,983
సిరికొండ	15,700	17,560
వేల్పూర్	16,704	19,864
వర్ని	12,734	13,816
ఎడపల్లి	14,429	16,518
ఏర్గట్ల	6,558	7,625

గ్రామ పంచాయతీల తుది ఓటరు జాబితా వచ్చేసింది. జిల్లాలో 27 మండలాల్లోనూ పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారే ఫలితాన్ని శాసించనున్నారు. జిల్లాలో 545 పంచాయతీల్లో సర్పంచి, 5,022 వార్డు పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఓటర్లు 8,30,580 ఉంటే పురుషులు 3,87,017, మహిళలు 4,43,548, ట్రాన్స్‌జెండర్లు 15 మంది ఉన్నారు. మగవారి కంటే ఆడవారు 56,531 మంది ఎక్కువగా ఉండటం గమనార్హం. సర్పంచి స్థానానికి పోటీచేసే ద్వితీయ శ్రేణి నేతలు ఇప్పటి నుంచే ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు. చాలా గ్రామాల్లో ఎవరు పోటీ చేయాలనేది లోలోపల నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. గెలిస్తే గ్రామానికి ఏదైనా గుర్తుండిపోయే పని చేయాలని ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం.

చిచ్చు రేపిన డిజిటల్ సర్వే

మరోమారు సమావేశమైన ఏఈవోలు ● బాధ్యులపై ఉన్నతాధికారుల ఆరా

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం, రెంజల్

క్షేత్రస్థాయికి వెళ్లి చేసే పంటల డిజిటల్ సర్వే వ్యవసాయశాఖలో చిచ్చు రేపింది. సహాయకులు లేకుండా ఒంటరిగా వెళ్లి సర్వే చేయడం తమ వల్ల కాదని వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవోలు) తెగేసి చెప్పడంతో ఉన్నతస్థాయిలో దీనిపై చర్చలు జరుగుతోంది. అదనంగా ప్రోత్సాహకం ఇస్తామని, ప్రభుత్వం అప్పగించిన పని చేయాల్సిందేనని కమిషనర్ స్థాయిలో ఒకవైపు సిబ్బందిని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే కొనసాగుతుంటే జిల్లాలో మాత్రం అధికారులు, సిబ్బంది మధ్య వివాదానికి దారి తీసింది. రెంజల్ ఏవో ఒకడుగు ముందుకేసి ఏఈవోలకు నోటీసులు ఇవ్వడంతో వివాదం మరింత ముదిరింది. స్థాయిల వారీగా ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకునే వరకు వెళ్లింది. సోమవారం ఏఈవోలు మరోమారు సమావేశమై రాష్ట్రవ్యాప్తంగా తమ యూనియన్లు తీసుకునే నిర్ణయానుసారం పనిచేస్తామని ప్రకటించారు. అయితే తాను ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరిస్తే కొందరు తన వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని రెంజల్ ఏవో ఏకంగా సొంత శాఖ సిబ్బందిపైనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారిపై ఉన్నతాధికారులకూ లేఖ రాశారు. వ్యక్తిగత కారణాలు ఎత్తిచూపారు. దీనికి ఎవరు బాధ్యులనే దానిపై శాఖాపరంగా అంతర్గత విచారణ జరుగుతోంది. శాఖాపరంగా నిర్వహించే వాట్సాప్ గ్రూపుల్లో ఎవరికి వారు ఫొటోలు, వ్యక్తిగత అంశాలు నిక్షిప్తం చేయడమే ఈ ఉదంతానికి ఆజ్యం పోసినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఇంటలిజెన్స్ విభాగం సైతం ఆరా తీస్తోంది. రెంజల్ ఏవో తమను వేధింపులకు గురిచేస్తున్నారని మండల డీలర్లు జిల్లా వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు



నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం న్యూ హౌసింగ్ బోర్డు విద్యుత్తు ఉపకేంద్రంలో మంగళవారం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించనున్నట్లు నగర ఏడీఈ-2 తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4 వరకు గంగాస్థాన్, కంఠేశ్వర్, న్యూ హౌసింగ్ బోర్డు, చంద్రశేఖర్ కాలనీ, బైపాస్ రోడ్డు, ఆర్మూర్ రోడ్డు, విద్యుత్తు నగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆరు వరద గేట్ల ఎత్తివేత

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద చేరిక సోమవారం 38,604 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో 1091 అడుగుల వరకు నీటి నిల్వ ఉండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. మధ్యాహ్న 2.15 గంటలకు ప్రాజెక్టు ఆరు వరద గేట్లను ఎత్తి గోదావరి నదిలోకి 18,744 క్యూసెక్కులు విడుదుల చేస్తున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో మైదానం

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్ఏను కాపాడుకోవడం కోసం చేసిన పోరాటాల వల్లే కొత్త మైదానం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఛైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ మైదానాన్ని సోమవారం పరిశీలించారు. మైదానంలో ఎనిమిది సింథటిక్ ట్రాక్‌ల నిర్మాణానికి స్థలం సరిపోతుందో లేదో అధికారులతో చర్చించారు. ఎన్నికల సమయంలో షబ్బీర్ అలీ ఇచ్చిన హామీమేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ మైదానం నిర్మించాలని ఆదేశించారని పేర్కొన్నారు. కచ్చితంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ట్రాక్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు రేవంత్‌రెడ్డి ఇక్కడ ఫుట్‌బాల్ ఆడారని గుర్తుచేశారు. ఆరెకరాల స్థలంలో మైదానం నిర్మాణం కోసం రూ.9.5 కోట్లు కేటాయించారని, క్రీడాసంఘాలు, నాయకులతో చర్చించి గ్రౌండ్ సిద్ధం చేస్తామన్నారు. బాక్సింగ్ రింగ్‌లో క్రీడాకారులతో మాట్లాడారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశవేణు, కార్పొరేటర్ గడుగు రోహిత్, నాయకులు నరాల రత్నాకర్, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సయ్య, నేతలు ఖైసర్, భక్తవత్సలం, రాంభూపాల్, రాము, దయాకర్‌గౌడ్, రామకృష్ణ, నరేందర్‌సింగ్ పాల్గొన్నారు.



ప్రణాళికను పరిశీలిస్తున్న శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్

ప్రజావాణికి వినతుల వెల్లువ

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల వేదిక ప్రజావాణికి సోమవారం వినతులు వెల్లువెత్తాయి. అదనపు పాలనాధికారులు కిరణ్ కుమార్, అంకిత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ప్రజల నుంచి 62 అర్జీలు స్వీకరించారు. జిల్లా కేంద్రం మూడో డివిజన్ పరిధిలో ఆర్టీసీ కాలనీలో స్థలాలు కొనుగోలు చేసిన బిల్డర్లు రోడ్డుపై అక్రమంగా వేసిన బోర్లను తొలగించాలని కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. సెట్‌బ్యాక్ లేకుండానే ఇళ్లు కడుతున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కమిటీ అధ్యక్షుడు సురేష్ రాజేందర్, కార్యదర్శి రోహిత్ ఉన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

ఆర్‌అండ్‌బీ ఇన్‌ఛార్జి ఎస్ఈగా వసంత్ నాయక్

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: రోడ్లు భవనాల శాఖ జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఈగా వసంత్ నాయక్‌ను నియమిస్తూ ఆ శాఖ ఈఎన్‌సీ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు వెల్లడించారు. ఇక్కడ ఎస్ఈగా పని చేసిన హన్మంతరావు పదవీ విరమణ పొందడంతో ఆ స్థానంలో సంగారెడ్డి జిల్లా ఎస్ఈగా కొనసాగుతున్న వసంత్ నాయక్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

పసుపులో తెగుళ్ల బెడద



దుంపకుళ్లు ఆశించిన వేరు భాగం

ఈనాడు, నిజామాబాద్

పసుపు సాగులో జిల్లాది ప్రత్యేక స్థానం. లాభనష్టాలకు వెరవక ఏళ్లుగా సంప్రదాయ పంటగా ఇక్కడి కర్షకులు వేస్తుంటారు. దాదాపు పుష్కర కాలం తర్వాత గత సీజన్‌లో పంటకు రికార్డు స్థాయిలో ధర దక్కింది. దీంతో రైతులు సాగు విస్తీర్ణం పెంచుకున్నారు. విత్తుకుని మూడున్నర నెలలు పూర్తి కావస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పొలాల్లో నీరు నిలిచి తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. అధిక తేమ కారణంగా దుంప కుళ్లు, దుంప పుచ్చు, ఆకుమచ్చ తెగుళ్లు కనిపిస్తున్నట్లు కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.మహేందర్ 'ఈనాడు'తో చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలనలో తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు సూచిస్తున్నట్లు వెల్లడించారు.

దుంపకుళ్లు : శిలీంధ్రం వల్ల కాండం కింది భాగం మెత్తగా మారిపోతుంది. నివారించకుంటే కొమ్ము పెరుగుదల ఉండదు. దుంప భాగం కుళ్లిపోతుంది. లక్షణాలు కనిపించగానే రిడోమిల్ 3 గ్రాములు లీటరు నీటిలో కలుపుకొని వేరు తడిచేలా కాండం వద్ద పోయాలి. మాగిన పసుపు ఎరువుతో ట్రైకో డెర్మా అభివృద్ధి చేసుకొని పొలంలో చల్లాలి.

నష్టాన్ని నివారించొచ్చు

నేల ఎక్కువ రోజులు తేమగా ఉంటే తెగుళ్లతో పంట దెబ్బతింటుంది. విత్తన శుద్ధి పాటించటంతో పాటు ఎత్తుసాళ్ల (బెడ్డు) పద్ధతిలో విత్తితే నష్ట ప్రభావం తక్కువ. అధిక వర్షాలతో మడుల్లో నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలి. లేనిచోట సమస్య కనిపిస్తోంది. రెండేళ్ల కిందట తెగుళ్లతో సగానికి సగం దిగుబడులు పడిపోయాయి. అప్రమత్తమై మా సూచన మేరకు మందులు వాడి తెగుళ్లను నివారించొచ్చు. **- మహేందర్, ప్రధాన శాస్త్రవేత్త**

దుంప పుచ్చు

ఈగ జాతికి చెందిన కీటకంతో ఈ తెగులు వస్తుంది. బియ్యం గింజ ఆకారంలో పురుగు కాండం కింది భాగంలో పెరిగి కొమ్ములోకి చొచ్చుకొని వెళ్లి పుచ్చిపోయేలా చేస్తుంది. ఈ పురుగు గుడ్లు పెట్టి మరిన్ని పురుగులను పుట్టిస్తుంది. దీంతో తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉంది. కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు ఎకరానికి ఆరు నుంచి ఏడు కిలోలు చల్లుకోవాలి. లీటరు నీటికి 0.5 మి.లి. పెనిట్రోథియాన్ లేదా రెండు మి.లి. క్లోరోపైరిపాస్‌ని కలుపుకొని పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ

దీనిని మర్రి ఆకు తెగులు అంటారు. ముదురు గోధుమ రంగులో ఉండి ఆకు మొత్తం వ్యాపించి ఎండిపోతుంది. ప్రస్తుత దశలో నివారించకుంటే పోషకాలు అందక కొమ్ము పెరగదు. దిగుబడులపై ప్రభావం పడుతుంది. నివారణకు గ్రాము కార్బండిజం, 2 గ్రాముల మాంకోజెబ్ లేదా మి.లి. అజోక్సీబిన్‌ని లీటరు నీటిలో కలిపి రెండు, మూడుసార్లు పంటపై పిచికారీ చేయాలి.



10 గుంటలు.. లాభం ₹10 లక్షలు

న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం

అందరూ సాగు చేసే పంటలు పండిస్తే మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాదు. ఎవరూ సాగుచేయని కొత్త రకానికి చెందిన ఆస్పరాగస్ పంటను గత అయిదేళ్లుగా సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆర్మూర్ పట్టణానికి చెందిన రైతు దడిగె శ్రీనివాస్. పెళ్లిళ్లు, శుభకార్యాల వేదికలపై చేసే అలంకరణకు, బొకేల తయారీలో ఈ ఆస్పరాగస్‌ను విరివిగా ఉపయోగిస్తున్నారు.



ఆస్పరాగస్ క్షేత్రంలో రైతు శ్రీనివాస్

రైతేరాజు

20 ఏళ్ల వరకు దిగుబడి

హైదరాబాద్ నాగోల్ ప్రాంతం నుంచి రూ. 52 వేలు ఖర్చుపెట్టి 3500 ఆస్పరాగస్ మొక్కలను తీసుకొచ్చారు. అయిదేళ్ల కిందట నాటుకున్నారు. ఆరు నెలల తర్వాత పంట కోతకు వచ్చింది. సేంద్రియ, కాంప్లెక్స్ ఎరువులు, ఇతర సస్యరక్షణ మందులకు గాను రూ.48 వేలు ఖర్చు చేశారు. అప్పటి నుంచి పంట ప్రతి మూడు నెలలకోసారి దిగుబడి వస్తుందని రైతు చెబుతున్నారు. ఆ సమయంలో రూ.70 వేల ఆదాయం సమకూరుతుందన్నారు. ఇప్పటి వరకు పెట్టుబడి ఖర్చులు పోనూ రూ.10 లక్షలకు పైగా లాభం వచ్చినట్లు చెప్పారు. మొక్కలు ఒక్కసారి నాటుకుంటే సరిపోతుందని 20 ఏళ్ల పాటు దిగుబడి ఇస్తాయని ఆయన చెబుతున్నారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉంది

- శ్రీనివాస్, రైతు, ఆర్మూర్

ఆర్మూర్ ప్రాంతంలో ఆస్పరాగస్‌కు మంచి డిమాండ్ ఉంది. కల్యాణమండపాలు, ఇతర అలంకరణ పనులు చేసేవారు పంట క్షేత్రానికి వచ్చి సొంతంగా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నందున ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేవు. ఈ ఏడాది మరో 10 గుంటల విస్తీర్ణంలో ఆస్పరాగస్ మొక్కలు నాటుకున్నా. డిసెంబర్ వరకు పంట కోతకు వస్తుంది.

చుక్క నీటికి చక్కటి ఫలితం

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: సాగుకు ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడి తగ్గించుకోవడం మేలన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తం అవుతోంది. సాలూర మండలం సరిహద్దు గ్రామమైన హున్సాలో రైతులు వాణిజ్య పంటల సాగుకు బిందు, తుంపర సేద్యంపై దృష్టిసారించారు.

200 ఎకరాల్లో: హున్సాలో సుమారు 200 ఎకరాల్లో బిందు సేద్యంతో అరటి, బొప్పాయి వంటి పండ్ల తోటలు, చెరకు, కూరగాయలను ఈ విధానాన్ని పాటిస్తున్నారు. పదేళ్ల కిందట ఒకరిద్దరు రైతులు పాటించే పద్ధతిని ప్రస్తుతం 50 నుంచి 60 మంది ఆచరిస్తున్నారు.

కలుపు నివారణకు తోడ్పాటు: బిందుసేద్యంతో 90 శాతం కలుపు నివారించవచ్చు. పంట అంతటికీ సమాన స్థాయిలో ఎరువులు అందుతుంది. నేరుగా మొక్క దగ్గరే చుక్క చుక్కగా నీరు పడి వృథా కాకుండా ఉంటుంది. విద్యుత్తు ఆదాతోపాటు భూమి గుల్లబారుతుంది. రెండు గంటల్లో అయ్యే పని గంటలోనే పూర్తవుతుంది. అరటిలో ఎకరానికి ఐదు క్వింటాళ్ల పైగా దిగుబడులు వస్తాయని, తక్కువ శ్రమతో రైతు 10 నుంచి 20ఎకరాల వరకు సాగుచేసుకో వచ్చని చెబుతున్నారు.



బిందుసేద్యంతో సాగవుతున్న అరటితోట

దిగుబడులు బాగా వస్తున్నాయి

- డి.ఎస్.స్వామి, రైతు



15 ఏళ్ల నుంచి బిందు సేద్యంతో పంటలు సాగుచేస్తున్నా. మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఐదెకరాల్లో అరటి, ఎకరంలో బొప్పాయి పండిస్తున్నా. రెండేళ్ల కిందట అరటిలో 45 టన్నుల దిగుబడి సాధించి రికార్డు పొందాను. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సత్కరించారు. సాధారణ పద్ధతిలో పోల్చితే బిందు సేద్యం ద్వారా ప్రతి మొక్కకు ఐదారు కిలోల దిగుబడి అదనంగా వస్తుంది. రైతులకు ప్రభుత్వం బిందు పరికరాలు అందిస్తే మంచి దిగుబడులు సాధిస్తాం.

యాసంగిలో పొద్దుతిరుగుడు

బోధన్ గ్రామీణం : వేరుశనగ, నువ్వుల నూనె కంటే పొద్దు తిరుగుడు నూనె శ్రేష్ఠమైంది. దీని నుంచి వనస్పతి తయారుచేస్తారు. వార్నిష్, సబ్బు, కలప పరిశ్రమల్లో ఈ నూనెను అధికంగా ఉపయోగిస్తారని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. పొద్దు తిరుగుడు నూనె తీసిన తర్వాత వచ్చే పిండి పశువులకు దాణాగా ఉపయోగించుకోవచ్చని బోధన్ మండల వ్యవసాయాధికారి సంతోష్ తెలిపారు. ఈ సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు తెలియజేస్తున్నారు.



విత్తే సమయం: నీటిపారుదల పంటగా సంవత్సరం పొడవున పండించవచ్చు. విత్తే సమయంలో పూతకు, గింజలు తయారయ్యేదశలో పంట దీర్ఘకాల వర్షంతోగాని లేదా పగటి ఉష్ణోగ్రత 38 సెల్సియస్ కంటే ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. యాసంగిలో వర్షాధారం కింద ఖరీఫ్‌లో నీటిపారుదల కింద నవంబరు రెండో పక్షం నుంచి జనవరి మొదటి 15 రోజుల వరకు విత్తుకోవచ్చు. నల్లరేగడి నేలల్లో తొలకరి నాటుకు అనువుగా ఉంటుంది. ఎర్ర, నల్లరేగడి నేలల్లో వరి తర్వాత పొద్దుతిరుగుడును డిసెంబరు ఆఖరి వారం నుంచి జనవరి మొదటి వారం వరకు విత్తుకోవాలి. పువ్వు వికసించి విత్తనం గట్టిపడే సమయంలో పగలు 12 గంటలు సూర్యరశ్మి ఉన్నట్లయితే నూనె శాతం అధికంగా వస్తుంది. నూనె నిల్వ సామర్థ్యం వాతావరణ ఉష్ణోగ్రతలు కంటే వేసవిలో అధికంగా ఉంటుంది. నీటిపారుదల ఉన్నట్లయితే ఏడాది పొడవునా సాగుచేయవచ్చు. అయితే యాసంగి, వేసవిలో విత్తుకుంటే అధిక దిగుబడినిస్తుంది.

నేలలు: నీరు నిల్వ ఉండని తటస్థ భూములైన ఎర్ర, చల్కా, ఇసుక, రేగడి, ఒండ్రునేలలు ఈ సాగుకు శ్రేష్ఠం. ఉదజని సూచిక 6.5 నుంచి 8.0 ఉంటే చాలా అనుకూలం. ఆమ్ల లవణాలు కంటే క్షార విలువలు కలిగిన నేలల్లో పంట బాగా పండుతుంది. పంట అధిక తేమను తట్టుకోలేదు కావున లోతట్టు, సముద్రతీర ప్రాంతాల్లో సాగుచేయరాదు. అంతర పంటలుగా కంది, వేరుశనగ వంటివి వేసుకుంటే అదనపు ఆదాయం వస్తుంది.

రైతు ప్రశ్న సమాధానం

కంది పంటలో ఆకు గూడు పురుగు ఆశిస్తోంది. నివారణ చర్యలు తెల్పండి?


కంది పంటలో ఆకు గూడు పురుగు నివారణకు 1.6మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 2.0 మి.లీ క్వినాల్‌ఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే సత్ఫలితం ఉంటుంది.
- సంతోష్, మండల వ్యవసాయాధికారి బోధన్



న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం

ముదిమిలో మురిపిద్దాం

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్



ముదిమి వయసు వారిని మురిపించాల్సిన అవసరముంది. కానీ వృద్ధుల విషయంలో సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. వయోధికులను భారంగా పరిగణిస్తూ.. వదిలించుకోవాలని యోచిస్తున్నారు. ఒక దశలో వృద్ధులు తమకు తాముగా బలవన్మరణానికి యత్నిస్తే.. కొన్ని సందర్భాల్లో కన్నవారి చేతుల్లోనే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. సమాజంలో వృద్ధులంటే వయసు మళ్లి ఏ పని చేయలేని స్థితి అన్న భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే వారిని ఆదరించి, వారి అనుభవాన్ని గౌరవించాలన్న ఉద్దేశంతో అక్టోబరు 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఆదరణ కరవు..

కన్నబిడ్డల పిల్లలతో సరదగా గడిపేదే ముదిమి వయసు. కారణాలేమైనా కాలక్రమంలో చిన్న కుటుంబాల సంస్కృతి పెరిగిపోయింది. కుటుంబాల్లో వృద్ధులకు చోటు లభించడం లేదు. ఫలితంగా ఒంటరిపక్షుల్లా జీవించాల్సి వస్తుంది. గ్రామాల్లో ఉంటే ఎవరో ఒకరితో మాటా..ముచ్చట, యోగక్షేమాలు తెలుసుకుని సాయం అందిస్తారు. పట్టణాలు, నగరాల్లో అయితే ఎవరి అవసరాలు వారు తీర్చుకోవడానికే సమయం ఉండదు. అందుకే ఇక్కడ ఒంటరి బతుకులన్న భావన కుంగదీస్తుంటుంది. ఇక కొందరు ఆస్తి కోసం తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తుండటం దయనీయం. ఇంట్లో నుంచి గెంటేసే వారు కొందరైతే.. డబ్బులిచ్చి వృద్ధాశ్రమాల్లో చేర్పించేవారు మరికొందరు. ఇలాంటి ఘటనలు జిల్లాలోనూ చోటు చేసుకోవడం కలవరపెట్టే అంశం.

ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు..

- కామారెడ్డి జిల్లాకు చెందిన ఒక వృద్ధుడు తన భార్య చనిపోయాక ఒంటరయ్యారు. కొడుకు లున్నా పట్టించుకోవడం మరిచిపోయారు. గత్యంతరం లేక ఒక ఆశ్రమంలో తలదాచుకుంటున్నారు.
- ఎడపల్లిలో ఆస్తి కోసం తనయుడు తల్లిదండ్రులను వేధింపులకు గురి చేశాడు. భరించలేని వారు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు కాకపోయినా.. ఘటన ఠాణా వరకు రావడం చర్చనీయాంశమైంది.
- బోధన్‌కు చెందిన వ్యక్తి జీవితకాలమంతా శ్రమించి ఆస్తులు కూడబెట్టారు. ఆయన చనిపోయాక ఆస్తి భార్య పేరు మీదకు బదిలీ అయింది. దాన్ని తమ పేరుకు మార్చాలని రోజూ ఆ తల్లికి వేధింపులు. చివరకు పెద్ద మనుషుల ఒప్పందంలో ఆస్తిని పిల్లల పేరు మీదకు బదిలీ చేశాక.. తల్లిని పట్టించుకునే నాథుడు లేడు. సర్కార్ పింఛన్‌తో ఆమె జీవిస్తున్నారు.
- నిజామాబాద్ జిల్లాకు చెందిన ఒక వృద్ధురాలి పేరుతో భర్త సంపాదించిన రెండు ఇంటి స్థలాలు ఉన్నాయి. వాటిని పంచాలని ముగ్గురు పిల్లలు డిమాండు చేశారు. ఆమె ఈ ఆస్తిని తనతో కలిపి నాలుగు భాగాలుగా పంచారు. తల్లి పేరుతో ఉన్న వాటాను తనయులు ఆమెకు తెలియకుండానే తమ పేరు మీదకు మార్చుకున్నారు. ఏ పని చేయలేని స్థితిలో కుమారులు నిర్లక్ష్యం చేయడంతో ఆమె దయనీయ జీవితం గడుపుతున్నారు.

నిర్లక్ష్యంపై ఆశ్రయించొచ్చు

..మురహరి, సీనియర్ సిటిజన్స్ ఫోరం డివిజన్ అధ్యక్షుడు

తల్లిదండ్రులను పిల్లలు నిర్లక్ష్యం చేస్తే ఆర్డీవో కార్యాలయంలోని కన్సిలియేషన్ కేంద్రాన్ని ఆశ్రయించొచ్చు. అక్కడ సబ్‌కలెక్టర్/ఆర్డీవో ఆధ్వర్యంలో విచారణ చేసి న్యాయం చేస్తారు. ఆస్తికి సంబంధించిన కేసుల్లో తలెత్తే వివాదాలే ఎక్కువగా వస్తుంటాయి. నిరాదరణకు గురైన వృద్ధులు సహాయ కేంద్రం 14567 నంబరుకు ఫోన్ చేయవచ్చు. మొహమాటం, భయం లేకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుని హక్కులు సాధించుకోవాలని కోరుతున్నాం.

మరణించినా రావట్లేదు..

బోధన్ మండలంలోని ఓ వృద్ధాశ్రమంలో ఇతర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులను తీసుకొచ్చి వదిలేసి వెళ్తున్నారు. వారు చచ్చిపోయినట్లు సమాచారమిచ్చినా పిల్లలు రాకపోవడంతో గ్రామస్థుల సాయంతో ఆశ్రమ నిర్వాహకులే అంత్యక్రియలు నిర్వహించారు. అలా ఈ ఏడాది ఇద్దరి అంతిమ సంస్కారాలు చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి.



41ఏ సీఆర్‌పీసీ రద్దు చేయాలని నిరసన

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెన్యూర్ పి.పి.లను ఇదివరకు మాదిరిగానే కొనసాగించాలని కోరారు. 41ఏ సీఆర్‌పీసీని వెంటనే రద్దు చేయాలన్నారు. న్యాయవాదుల రక్షణకు చట్టాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, ఉపాధ్యక్షులు రాజు, గ్రంథాలయ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, కార్యదర్శి దోన్‌పాల్ సురేశ్ సీనియర్ న్యాయవాదులు ఎర్రం గణపతి, పరుచూరి శ్రీధర్, భాస్కర్, నారాయణ, సురేశ్, భిక్షపతి, జయపాల్, కవితరెడ్డి సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చైనా మాంజా స్వాధీనం

నిజామాబాద్ నేరవిభాగం : రెండో ఠాణా పరిధిలో నిషేధిత చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలో చైనా మాంజా అమ్ముతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది దాడులు నిర్వహించి ఎన్‌కే కైట్ దుకాణంలో రూ.1.09 లక్షల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. మాంజా, దుకాణ యజమానిపై సోమవారం కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో యాసిర్ అరాఫత్ తెలిపారు.

మార్కెటంతా మక్కలే...



జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్న పంట చేతికొస్తోంది. కోసిన పంటను కర్షకులు విక్రయానికి నిజామాబాద్ మార్కెట్‌యార్డుకు తరలిస్తున్నారు. కొంత పచ్చిగా ఉండటంతో ఇలా మార్కెట్ ఆవరణంతా ఆరబెడుతున్నారు.
– ఈనాడు, నిజామాబాద్

గుంటూరు నుంచి ఇందూరుకు...

నిండా ప్లాస్టిక్ సంచులతో కనిపిస్తున్న ఈ వ్యాన్ గుంటూరు నుంచి జిల్లా కేంద్రానికి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న, వరి కోతల ప్రారంభానికి ముందే రైతులకు వీటిని అందుబాటులో ఉంచేందుకు దాదాపు 30 మంది వ్యాపారులు వ్యాన్‌లను అద్దెకు తీసుకుని ఉమ్మడి జిల్లాకు తెచ్చారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు అన్నదాతలు వీటిని కొనుగోలు చేస్తున్నారు.

న్యూస్‌టుడే, డిచ్‌పల్లి గ్రామీణం



గుంతల దారులు.. వాహనదారుల ఇబ్బందులు

ఇటీవల కురిసిన వానలకు గ్రామీణ రోడ్లు ఛిద్రం అయ్యాయి. బోధన్ మండలం కల్దుర్కి- మావందిఖుర్దు వెళ్లే పంచాయతీరాజ్ రహదారి పూర్తిగా రెండు కి.మీ మేర గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం





విద్యార్థులతో డీఈవో దుర్గాప్రసాద్, ఎంఈవో సాయిరెడ్డి

కరాటేలో ఉత్తమ ప్రతిభ

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని దారుగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అక్షయ, మనస్విని ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు ఎంఈవో సాయిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం డీఈవో దుర్గాప్రసాద్ వారిని ప్రత్యేకంగా అభినందించినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు అభినందన

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నాగారాం రాజారాం స్టేడియంలో జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో డిచ్‌పల్లి మండలం రాంపూర్ మహాత్మా జ్యోతిబా పులే విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ నరేష్‌గౌడ్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం అభినందించారు. జూనియర్ అథ్లెటిక్స్‌లో జిల్లా స్థాయిలో ఆరు బంగారు, ఐదు రజత, నాలుగు కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నరేష్‌గౌడ్, ఉపాధ్యాయులు

రుణమాఫీ అమలు చేయాలని వినతి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్మూర్ పట్టణానికి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతి పత్రం అందజేశారు. రేషన్ కార్డు నిబంధన తొలగించి, రైతు భరోసా సైతం అమలు చేయాలన్నారు. ఆయన్ని కలిసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని, తర్వాత అయిదుగురిని అనుమతించారని జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రభుత్వంలో రైతు సమస్యలపై మంత్రిని కలిసేందుకు ఆంక్షలు ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు లింగారెడ్డి, దేగాం యాదాగౌడ్, భూమారెడ్డి, సుధాకర్, రాజన్న, చిన్నారెడ్డి, గంగారాం ఉన్నారు.



చుట్టూ ఆవాసాలు.. మధ్యలో మురికి కూపం

నిజామాబాద్ జిల్లా కేంద్రం గంగస్థాన్ ఫేస్-1లో పారిశుద్ధ్య దుస్థితికి ఈ చిత్రం అద్దం పడుతోంది. వాన నీరు, మురుగు పారేందుకు పక్కా కాలువల నిర్మాణం చేపట్టలేదు. ఫలితంగా ఇలా ఇళ్ల మధ్యలో ఓ పెద్ద కాసారమే తయారైంది. ఇక్కడ దోమలు వృద్ధి చెందుతున్నాయి. స్థానికులు రోగాల బారిన పడుతున్నారు.



– న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

సైబర్ నేరాలపై అవగాహన

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: గిరిరాజ్ కళాశాలలో బీఎస్ఎన్ఎల్ సౌజన్యంతో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, కంప్యూటర్ విభాగాల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. డివిజనల్ ఇంజినీర్ రమేశ్ హాజరై సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాళ్లు అబ్దుల్ రఫీక్, రంగారత్నం, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజినీరు రమేశ్, చిత్రంలో ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు

జాబ్‌మేళాలో 12 మంది ఎంపిక

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: గిరిరాజ్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో స్టార్ పవర్ డిజిటల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో జాబ్‌మేళా నిర్వహించారు. డిగ్రీ పూర్తయిన వారికి పరీక్షలు నిర్వహించగా ప్రతిభ చాటిన 12 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

దూరవిద్య ప్రవేశాల గడువు పెంపు

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య అధ్యయన కేంద్రంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు ఈ నెల 15 వరకు పెంచినట్లు ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త రంజిత ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7382929612 నంబరులో సంప్రదించాలన్నారు.

ఈ నెల 2, 3 తేదీల్లో శిక్షణ

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: 'బట్టీ విధానం వద్దు.. ఆటపాటలతో చదువులే ముద్దు' అనే అంశంతో ఈ నెల 8, 9 తేదీల్లో నిజామాబాద్‌లో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 3 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే రిసోర్సు పర్సన్లకు 2, 3 తేదీల్లో మల్లు స్వరాజ్యం ట్రస్టు భవన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

చలో హైదరాబాద్‌కు భాజపా నాయకులు



నిజామాబాద్ నగరం, సిరికొండ: ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే రైతు హామీల సాధన దీక్షలో భాగంగా స్థానిక భాజపా నాయకులు సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఎమ్మెల్యే ధన్‌పాల్, పల్లె గంగారెడ్డి, దినేష్ కులాచారి తదితరులు ఉన్నారు.

వృద్ధులపై చిన్నచూపు వద్దు

మోపాల్, న్యూస్‌టుడే: వృద్ధులపై చిన్న చూపు తగదని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ అధ్యక్షుడు డా.రవీంద్రనాథ్ సూరి తెలిపారు. మోపాల్‌లో సోమవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ ఫోరం, వీడీసీ సహకారంతో మనోరమ హాస్పిటల్ సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.



ఈనాడు సినిమాలు

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)
స్క్రీన్-1: దేవర పార్ట్-I : 12.55, 4.10, 7.20, 10.30(రాత్రి)
స్క్రీన్-2: దేవర పార్ట్-I 10.30
సత్యం సుందరం 10.00(రాత్రి)
స్క్రీన్-3: సత్యం సుందరం: 1.30, 4.30, 7.30
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)
స్క్రీన్-1: దేవర పార్ట్-I : 11.15, 2.50, 6.25, 10.00 (రాత్రి)
స్క్రీన్-2: మత్తు వదలరా-2 12.15, 3.30
దేవర పార్ట్-I 7.10, 10.50(రాత్రి)
స్క్రీన్-3: మత్తు వదలరా-2
12.00, 3.00, 6.10, 9.00 (రాత్రి)
స్క్రీన్-4: సత్యం సుందరం: 11.00, 2.40, 6.20, 10.00(రాత్రి)
దేవి (ఎస్వీసీ): సత్యం సుందరం 11.15, 2.15, 6.15, 9.15(రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): దేవర పార్ట్-I (హిందీ) 11.00, 2.30, 6.00, 9.30(రాత్రి)
లలితామహల్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 10.45, 2.15, 6.00, 9.30(రాత్రి)
విజయ్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 10.50, 2.20, 6.00, 9.40(రాత్రి)

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

బల్దియాకు రూ.15 కోట్లు

న్యూస్‌టుడే, బోధన్





బోధన్ బల్దియాకు నిధులొచ్చాయి. ఈ మేరకు రూ.15కోట్ల నిధుల ప్రతిపాదనలు పంపాలని పురపాలక శాఖ బల్దియాకు లేఖ రాసింది. అందుకు సంబంధించి పనుల కసరత్తు చేయాల్సి ఉందని ఇటీవల పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో ప్రకటించారు. ఎట్టకేలకు కొత్త ప్రభుత్వ హయాంలో విడుదలైన నిధులతో మౌలిక వసతులు కల్పించడానికి మార్గం సుగమమైంది. అసెంబ్లీ ఎన్నికల నుంచి జూన్ వరకు ఎన్నికల నియమావళితోనే కాలం గడిచిపోయింది. సర్కారు ప్రాధామ్యాలు వేరు కావడంతో నిధుల విడుదలపై అంతా ఎదురు చూశారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల పట్టణంలో ప్రగతికి సంబంధించి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమీక్షలు నిర్వహించారు. వీటికితోడు క్షేత్ర పర్యటన చేశారు. ప్రత్యక్ష పరిశీలన, స్థానికుల విజ్ఞప్తుల నేపథ్యంలో ఆయన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించారు. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలతో పురపాలక శాఖ రూ. 15కోట్ల నిధులకు సంబంధించిన అంచనాలు రూపొందించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ పనులకు ప్రతిపాదనలు పంపిస్తే నిధులు విడుదలయ్యే ఆస్కారముంది. వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలకు ఎక్కువ డిమాండు ఉంది. కొన్ని వార్డుల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. విస్తరిస్తున్న కాలనీల్లోనూ మౌలిక వసతుల కొరత ఉంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేసే ఆస్కారముందని తెలుస్తోంది. ఏడాది నుంచి పట్టణంలో ప్రగతి పనులు ఒకరకంగా మొత్తానికి నిలిచిపోయాయనే చెప్పాలి. పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోవడం, ఇతర పద్దుల్లోని నిధులపై స్పష్టత కొరవడటంతో అభివృద్ధి సాధ్యపడలేదు. తాజా నిధులతో ఒక్కసారిగా ఊపిరిపోసినట్లైంది. ప్రస్తుత పాలకవర్గ గడువు జనవరి 25న ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మంజూరయ్యే నిధులపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

ఇనుప చువ్వలతో తిప్పలు

బోధన్ మండలం నాగన్‌పల్లి వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వారధిపై అక్కడక్కడా స్లాబుపై ఇనుప చువ్వలు తేలి బయటకు కనిపిస్తున్నాయి. వంతెన మీదుగా ప్రయాణం సాగించే వాహనాలకు ఇనుప చువ్వలు గుచ్చుకుని టైర్లు దెబ్బతినడంతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ఈ వారధి మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. తాత్కాలిక మరమ్మతులు చేయించి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం

ఆలయాల పవిత్రత కాపాడాలి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: వీహెచ్‌పీ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాగూర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ కార్యదర్శి గణపురం రాజేశ్వర్‌రెడ్డి, వీహెచ్‌పీ విభాగ్ ప్రముఖ్ తుమ్మల కృష్ణ హజారే మాట్లాడారు. దేవాలయాల పవిత్రతను కాపాడటంతో పాటు అన్యాక్రాంతం అవుతున్న భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. తిరుమల లడ్డూ కల్తీపై సిట్టింగ్ జడ్జితో విచారణ, సనాతన బోర్డు ఏర్పాటు తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ అంకిత్‌కు అందజేశారు. మల్లారం పీఠ కృష్ణమహరాజ్, దత్తమందిరం హరిదాసు స్వామీజీ, ఇస్కాన్ కురుశ్రేష్ఠ, ... రామానందరాయ గౌరదాస్, ద్వారకానగర్ కేంద్రం అధ్యక్షుడు సిద్ధలరాం ప్రజాపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, హిందూ వాహిని అనిల్ కదం, లక్ష్మణ్, ఏబీవీపీ శశి, రాములు, వివిధ ధార్మిక క్షేత్రాల ప్రతినిధులు పాల్గొని తమ సంఘీభావం తెలియజేశారు.



జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న హిందూ సంస్థల ప్రతినిధులు

శివపార్వతుల కల్యాణం

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: శంభునిగుడిలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. వేదపండితులు వేలేటి పశుపతిశర్మ నేతృత్వంలో అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి కన్యాదానం, కానుకలు సమర్పించారు.



శంభునిగుడిలో కల్యాణం జరిపిస్తున్న పండితులు, పూజారులు

పొరుగు రాష్ట్రాలకు పచ్చిధాన్యం

రెంజల్, న్యూస్‌టుడే: రెంజల్ మండలంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వారం కిందట వరి కోతలు ప్రారంభమయ్యాయి. స్వల్ప, మధ్యకాలిక సన్నరకాల పంటలు చేతికి అందడంతో వ్యాపారులు పచ్చిధాన్యం కొనుగోళ్లను జోరుగా చేపడుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2300 ఉండగా ఈ ధరకు సమానంగా రూ.2,250 నుంచి రూ.2300 మధ్య చెల్లిస్తున్నారు. రాష్ట్రంలోని మిర్యాలగూడతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు పచ్చి ధాన్యాన్ని తరలిస్తున్నారు. అక్కడి వ్యాపారులు జిల్లాకు చెందిన మధ్యవర్తులతో ధాన్యం కొనుగోలు చేయించి తరలిస్తున్నారు.



దూపల్లిలో కొనుగోలు చేసి లారీలో లోడ్ చేస్తున్నారిలా..

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

●● సమస్య : బోధన్ గోశాల రోడ్డులో మరుగు జాల ఎదురుగా చెత్త కుప్పలు తొలగించాలి. - శంకర్, బోధన్



●● పరిష్కారం : విషయాన్ని శానిటరీ జవాన్ గాబ్రియెల్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరింపజేశారు.

●● ఎడపల్లి పాత గ్రామంలోని పలు వార్డుల్లో చెత్తాచెదారం పేరుకు పోయింది. - ఎడపల్లి, పాత గ్రామస్థులు



●● పంచాయతీ కార్యదర్శి నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో శుభ్రం చేయించారు.

●● కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. - సత్యనారాయణపురం గ్రామ మహిళలు

●● త్వరలో పరిష్కరిస్తాం. - గ్రామాభివృద్ధి కమిటీ

●● వినాయక్‌నగర్ శ్రీనగర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - రవికుమార్, స్థానికుడు

●● పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - ఇనాయత్, ఏఈ, బల్దియా

●● జక్రాన్‌పల్లిలోని మునిపల్లిలో మురుగు నీరు పంట పొలాలకు వెళ్లే దారిపై ప్రవహిస్తుంది. -గంగారెడ్డి, మునిపల్లి

●● మురుగు కాల్వ తవ్వి పరిష్కరిస్తాం- యూసఫ్‌ఖాన్, ప్రత్యేకాధికారి, మునిపల్లి

●● దుబ్బ శ్మశాన వాటిక ఎదురుగా కృష్ణ మందిర్‌కు వెళ్లే రోడ్డులో ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థాలు పారవేస్తున్నారు. -శ్రీనివాస్, దుబ్బ



●● ఈ విషయంపై దృష్టిసారించి అక్కడ వేయకుండా నిఘా ఏర్పాటు చేసి చెత్త వేసిన వారికి జరిమానా వేస్తాం. - ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

●● 4వ ఎన్‌జీవస్ కాలనీలో ఎక్కువ సంఖ్యలో ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. ఇక్కడ నీరు నిలిచి దోమలు విపరీతంగా ఉన్నాయి. కలెక్టరేట్‌కు దగ్గరగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. - విజయ్‌కుమార్, 4వ ఎన్‌జీవోస్ కాలనీ

●● వర్షపు నీరు వెళ్లేలా కచ్చా డ్రైనేజీలు నిర్మిస్తాం. నీరు లేకపోతే ఫాగింగ్ చేస్తాం. - ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షుడు

–న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ అర్బన్, వర్ని, ఎడపల్లి, బోధన్

బతుకమ్మ సంబరాలు



నిజామాబాద్ గ్రామీణం: కొండూరు కేజీబీవీ పాఠశాలలో..



బోధన్: పాన్‌గల్లీలో అట్ల బతుకమ్మలతో మహిళలు



కోటగిరిలో..

జిల్లా వ్యాప్తంగా సోమవారం బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయి. పాఠశాలల్లో రంగురంగుల బతుకమ్మలను పేర్చి వేడుకలు నిర్వహించారు. పాటలు పాడుతూ అలరించారు. అనంతరం వాటిని నిమజ్జనం చేశారు. - న్యూస్‌టుడే, బృందం



నవీపేటలో..



చిన్నారుల కోలాహలం



ఎడపల్లిలో..



నిజామాబాద్ నగరం: న్యాల్‌కల్ రోడ్డులో



డిచ్‌పల్లి: బాలికల గురుకుల పాఠశాలలో..

ఆదుకోవాలని డిమాండ్

బోధన్, న్యూస్‌టుడే : ప్రభుత్వం, ప్రైవేటు యాజమాన్యానికి మధ్య సమస్యతో నిజాం దక్కన్ సుగర్స్ లేఆఫ్‌తో రోడ్డున పడిన కార్మికులను ఆదుకోవాలని కార్మిక నాయకులు కుమారస్వామి, రవిశంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. పరిశ్రమ ఎదుట సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విధివిధానాలు ప్రకటించి పరిశ్రమ తెరిపించడం, తొమ్మిదేళ్ల కార్మికుల లేఆఫ్ కాల వేతన బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, బాలకృష్ణ ఉన్నారు.



పరిశ్రమ ఎదుట కార్మిక నాయకులు

సమావేశాలు.. తీర్మానాలు

డిచ్‌పల్లి గ్రామీణం, నిజామాబాద్ గ్రామీణం, ఇందల్‌వాయి, మోపాల్, రుద్రూర్, చందూర్, నవీపేట, రెంజల్, సాలుర న్యూస్‌టుడే: డిచ్‌పల్లి సొసైటీ పరిధిలో త్వరలో ప్రారంభించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామని నూతన ఛైర్మన్ రాంచందర్ గౌడ్ అన్నారు. డిచ్‌పల్లి సహకార సంఘం మహాజన సభ సోమవారం నిర్వహించారు. నిజామాబాద్ గ్రామీణ మండలంలోని గుండారం సహకార సంఘం దొడ్డ రకానికి మద్దతు ధరతో పాటు బోనస్ ప్రకటించాలని తీర్మానించింది. ఇందల్‌వాయిలోని నల్లవెల్లి సహకార సంఘం సమావేశం ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బోర్గాం(పి), నిజామాబాద్ అర్బన్, రుద్రూర్, చందూర్, బినోల, సాలూర, రెంజల్ మహాజన సభలు జరిగాయి. ఆయా సొసైటీ ఛైర్మన్లు చంద్రశేఖర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సంజీవరెడ్డి, అశోక్, హన్మాండ్లు, జనార్దన్, ఇమ్రాన్‌బేగ్ తదితరులు పాల్గొని తీర్మానాలు చేశారు.

మిత్రుల చేయూత

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపల్లిలో ఇటీవల చెక్‌డ్యాంలో మునిగి మృతి చెందిన ప్రశాంత్ కుటుంబానికి అతని పదో తరగతి స్నేహితులు సోమవారం రూ.57,300 ఆర్థిక సాయం చేశారు.



బాధిత కుటుంబ సభ్యులతో యువకులు

అంత్యక్రియల్లో బాజిరెడ్డి

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: భారాస దూస్‌గాం గ్రామ శాఖ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి అమ్మమ్మ పడిగెల గంగవ్వ (110) మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జగన్, నాయకులు పద్మారావు, కృష్ణ తదితరులు సోమవారం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు.



పాడె మోస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు భూమయ్య పేర్కొన్నారు. సోమవారం అర్సపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కోతలు ప్రారంభమైన ప్రాంతాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకుడికి సన్మానం

నిజామాబాద్ కలెక్టరేట్: కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించే సూపరింటెండెంట్ విజయేందర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరై విజయేందర్‌రెడ్డి దంపతులను సన్మానించారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీవో రాజేంద్రకుమార్ ఉన్నారు.



సత్కారం

ధర్పల్లి: ఉద్యోగ జీవితంలో చేసిన సేవలు ఎప్పుడూ గుర్తుండిపోతాయని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసిన ఫార్మాసిస్ట్ కృష్ణ, పీహెచ్ఎన్ మేరీ పదవీ విరమణ పొందగా వీరిని సోమవారం సన్మానించారు.

డిచ్‌పల్లి గ్రామీణం: రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ హైదరాబాద్ నుంచి ఉట్నూర్ వెళ్తున్నారు. విషయం తెలుసుకున్న గిరిజన నాయకులు మోహన్, జవీన్, విఠల్ తదితరులు డిచ్‌పల్లి మండలం నడిపల్లి జాతీయ రహదారి తెవివి ప్రధాన ద్వారం వద్ద వాహనాన్ని ఆపి ఆయనను సత్కరించారు.

జ్యోతిబా ఫులేను ఆదర్శంగా తీసుకుందాం

సిరికొండ, న్యూస్‌టుడే: కుల రహిత సమాజ స్థాపనకు కృషి చేసిన మహాత్మా జ్యోతిబా ఫులేను ఆదర్శంగా తీసుకోవాలని ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి కారల్‌మార్క్స్ తెలిపారు. సిరికొండ, గడ్కోల్‌లో మహాత్మ జ్యోతిబా ఫులే సత్యశోధక్ సమాజ్ సంస్థను సోమవారం స్థాపించారు.

విద్యార్థులకు అభినందన

మోపాల్, డిచ్‌పల్లి న్యూస్‌టుడే: జిల్లా స్థాయి సైన్సు డ్రామా పోటీల్లో ప్రతిభ చూపి రెండో బహుమతి అందుకున్న సిర్పూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులను సోమవారం అభినందించినట్లు హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. ఉపాధ్యాయులు కాసర్ల నరేశ్‌రావు, శ్యామల తదితరులు ఉన్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌లో సుద్దపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సీనియర్ వాలీబాల్ అండర్- 19 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి పురస్కారం అందుకున్నారు. ప్రిన్సిపల్ నళిని, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు

కార్ఖానా: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి పోటీలను బోయిన్‌పల్లి క్రీడా మైదానంలో బోర్డు సీఈవో మధుకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. పోటీల్లో వికారాబాద్, మేడ్చల్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి సుమారు 699మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని గిరిజన అభివృద్ధి అధికారి కోటాజీ తెలిపారు.

మనస్తాపంతో బలవన్మరణం

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఒకరు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గ్రామీణ మండలం ముబారక్‌నగర్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఠాణా ఎస్‌హెచ్ఓ మహమ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీహరి(45) ఓ అద్దె ఇంట్లో మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఎదురింట్లో ఉంటున్న కళావతి కుటుంబంతో గతేడాది గొడవలు జరగగా ఆమె ఇంట్లోకి వెళ్లి కుటుంబంపై దాడి చేశాడు. దీనిపై శ్రీహరితో పాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. కేసు వెనక్కి తీసుకోవాలని కళావతిని శ్రీహరి కోరారు. ఇందుకు ఆమె రూ.5 లక్షలు డిమాండ్ చేసింది. అంత చెల్లించుకోలేనని తీవ్ర మనస్తాపం చెంది బుధవారం రాత్రి కళావతి ఇంటి ఎదుట పెట్రోల్ పోసుకొని శ్రీహరి నిప్పు అంటించుకున్నాడు. స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ శ్రీహరి మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ పేర్కొన్నారు.

సేవలు మరువలేనివి

రెంజల్: రెంజల్, నవీపేట మండలాల్లో బాధ్యతలు నిర్వర్తించిన ఎంఈవో గణేశ్‌రావు సేవలు మరువలేనివని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్ అన్నారు. సోమవారం పదవీ విరమణ పొందిన గణేశ్‌రావు దంపతులను ఆయన దూపల్లి పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు సత్కారం

బోధన్, న్యూస్‌టుడే : బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోను దళిత ఐక్య వేదిక ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. నాయకులు విద్యాసాగర్, రాజేష్, గంగారాం, రామకృష్ణ, దాసు, బాలరాజు, రామకృష్ణ, నాగురావు, మహేందర్, రాజు తదితరులు ఉన్నారు.



యువకుడి ఆత్మహత్య

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ పట్టణం రాకాసిపేట్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న యువకుడు మహమ్మద్ అల్తాఫ్ (20) ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణం చెందారు. ఆయనకు వివాహం కాలేదు. మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప కడ్డీకి ఉరేసుకుని మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

మోపాల్, న్యూస్‌టుడే: న్యాల్‌కల్‌కు చెందిన యువకుడు ఆదర్శకుమార్(33) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ వివరాల ప్రకారం.. వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్న ఆదర్శకుమార్ అప్పులు అధికం కావడంతో మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపంతో ఇటీవల పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర గోదావరి నదిలో పుణ్య స్నానం ఆచరిస్తూ నాలుగు రోజుల క్రితం గల్లంతైన డిచ్‌పల్లి మండలం ధర్మారానికి చెందిన జయ (45) మృతదేహం సోమవారం లోకేశ్వరం మండలం కనకపూర్ సమీపంలో లభ్యమైంది. లోకేశ్వరం పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి బాసర పోలీసులకు సమాచారం ఇచ్చారు. భైంసా ఆసుపత్రిలో శవ పరీక్ష చేయించారు. బాసర ఎస్సై గణేశ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆత్మహత్యాయత్నం అడ్డగింత

ఎడపల్లి, న్యూస్‌టుడే: జానకంపేటకు చెందిన ఓ వివాహిత తన కూతురితో కలిసి ఆత్మహత్య చేసుకొనేందుకు సోమవారం రాత్రి అశోక్‌సాగర్ చెరువు వద్దకు వచ్చింది. ఆత్మహత్యకు యత్నించే క్రమంలో అక్కడే ఉన్న రెవెన్యూ సిబ్బంది, స్థానికులు గమనించి అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకొన్న పోలీసు సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. కాగా జిల్లా కేంద్రానికి చెందిన సదరు వివాహిత కొన్ని నెలలుగా జానకంపేటలోనే ఉంటోంది. మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఆత్మహత్య చేసుకొనేందుకు చెరువు వద్దకు వచ్చిందని స్థానికులు చెప్పారు.

టమాటా లోడు వాహనం బోల్తా

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి మండలం వివేక్‌నగర్ తండా 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున టమాటా లోడుతో వెళ్తున్న భారీ కంటెయినర్ బోల్తా పడింది. స్థానికుల వివరాల ప్రకారం. అనంతపూర్ నుంచి జగదల్‌పూర్‌కు వెళ్తున్న వాహనం ఒక్కసారిగా బోల్తాపడింది. కూలీలు టమాటాలను మరో వాహనంలోకి మార్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు.



అదుపుతప్పి విభాగినిని ఢీకొన్న లారీ

మోపాల్, న్యూస్‌టుడే: ఆర్యనగర్ పెట్రోల్ పంపు వద్ద భారీ యంత్రాలను తీసుకెళ్లే లారీ అదుపు తప్పి విభాగినిని ఢీ కొట్టిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆ సమయంలో వాహనాలు పెద్దగా రాకపోవడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవీపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. రెంజల్ మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను ఆదివారం అర్ధరాత్రి దాటాక నవీపేటలోని శివాజీచౌక్ వద్ద పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. ఈ మేరకు టిప్పర్ యజమానికి రూ.20 వేల జరిమానా విధించినట్లు తహసీల్దారు వెంకటరమణ పేర్కొన్నారు.

విద్యావనరుల కేంద్రంలో బోరు మోటారు చోరీ

బోధన్ గ్రామీణం: బోధన్ మండల విద్యావనరుల కేంద్రంలోని బోరుబావి మోటారును ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బోరుబావిలోని మోటారును నీళ్లలోంచి తీసి పైపును అక్కడే వదిలేసిన దుండగులు కేవలం మోటారు మాత్రమే ఎత్తుకెళ్లారు. సోమవారం కార్యాలయానికి వచ్చిన ఉద్యోగులు చోరీ జరిగినట్లు గుర్తించిన అధికారులు ఘటనపై సీఐ వెంకటనారాయణకు ఫిర్యాదు చేశారు.

ఆర్మూర్
• ఆర్మూర్ • బాల్కొండ

వ్యర్థాల నుంచి కళాకృతులు


కళాకృతులు పరిశీలిస్తున్న పుర కమిషనర్ రాజు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్మూర్ పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులు వ్యర్థ పదార్థాల నుంచి కళాకృతులు తయారు చేసి ప్రదర్శించారు. పుర కమిషనర్ రాజు వాటిని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీరు పూర్ణమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం


విద్యార్థినితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

మాక్లూర్, న్యూస్‌టుడే: విద్యార్థినులకు సమాజం పట్ల అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆర్మూర్ శాసనసభ్యుడు పైడి రాకేష్‌రెడ్డి కోరారు. ఏలియానాయక్‌తండాలోని ఎస్టీ హాస్టల్, మాక్లూర్ కస్తూర్బా పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన వసతులు ఎలా ఉన్నాయనే విషయమై ఆరా తీశారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. వారిని ఉపాధ్యాయులు తమ సొంత పిల్లలుగా చూసుకున్నప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. తాను ఇప్పటివరకు సందర్శించిన అన్ని స్కూళ్లలోకంటే ఏలియానాయక్‌తండాలోని వసతిగృహం బాగుందని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో విద్యారాణి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
94939 26837
98666 11160

ఆర్మూర్ పట్టణం: 4వ వార్డులో రోడ్డుపై చెట్టు పెంచుతున్నారు. ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు**

సమాధానం: సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటాం. **- రాజు, బల్దియా కమిషనర్**

నందిపేట్: నందిపేట్‌లోని పాతూర్‌లో మురుగు కాలువలు శుభ్రంగా లేవు. **-నితిన్**

సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తా. **-లక్ష్మీప్రసాద్, ఎంపీవో**

మాక్లూర్ గ్రామీణం: చిన్నాపూర్ లో చెత్త ట్రాక్టర్ సరిగా రావటం లేదు. **-రాజు**

సమాధానం: ట్రాక్టర్ పంపి చెత్తను సేకరించేవిధంగా చర్యలు తీసుకుంటాం. **-ఎంపీవో, శ్రీనివాస్**

లీకేజీకి మరమ్మతులు



మాక్లూర్ గ్రామీణం: అమ్రాద్‌లో పైపులైన్ లేకేజీ ఉందని స్థానికుడు 'మేమున్నాం మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి మరమ్మతులు చేయించారు.

గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

☛ మంత్రి జూపల్లి కృష్ణారావు


ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

ఆర్మూర్ పట్టణం, భీమ్‌గల్, మోర్తాడ్, న్యూస్‌టుడే: ఆబ్కారీ శాఖలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు అన్నారు. భీమ్‌గల్, మోర్తాడ్, ఆర్మూర్‌లో నూతనంగా నిర్మించిన ఆబ్కారీశాఖ కార్యాలయాలను సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయా సమావేశాల్లో మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మత్తు పదార్థాల విక్రయాలు, వాడకాలను ఉపేక్షించేది లేదన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఆబ్కారీ, పోలీసు శాఖల సేవలను సమర్థంగా వినియోగించుకుంటున్నామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, హనుమంత రావు, ఆర్మూర్ సీఐ స్టీవెన్‌సన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు వినయ్ రెడ్డి, ముత్యాల సునిల్ కుమార్, ఎక్సైజ్ ఎస్సైలు పాల్గొన్నారు.

సిద్ధులగుట్ట అభివృద్ధికి రూ.50 లక్షలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ నవనాథ సిద్ధుల గుట్ట అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఆర్మూర్ సిద్ధుల గుట్టకు వచ్చారు. ఆలయ కమిటీ, అర్చకులు స్వాగతం పలికారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపైన జరుగుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తుల అవసరాల దృష్ట్యా ప్రభుత్వం తరఫున నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీసేవ చేపట్టారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మార గంగారెడ్డి, సాయిబాబా గౌడ్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు


బాధ్యతలు తీసుకున్న శిక్షణ కలెక్టర్ సంకేత్‌కుమార్

మాక్లూర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందించడమే తన ప్రధాన లక్ష్యమని శిక్షణ కలెక్టర్ సంకేత్‌కుమార్ పేర్కొన్నారు. మాక్లూర్ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అంకిత భావంతో విధులు నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ముత్తన్న, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గంగారాం, విద్యాధికారి సత్యనారాయణ, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు భాజపా నాయకులు

నిజామాబాద్ నగరం, సిరికొండ: ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే రైతు హామీల సాధన దీక్షలో భాగంగా స్థానిక భాజపా నాయకులు సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన రైతు హామీల సాధన దీక్షలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పల్లె గంగారెడ్డి, దినేష్ కులాచారి, న్యాలం రాజు, మల్లేష్ యాదవ్, పంచరెడ్డి శ్రీధర్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుల్లో బతుకమ్మ వేడుకలు


ఆర్మూర్ ప్రజ్ఞలో..

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్‌లోని కృష్ణవేణి ట్యాలెంట్ పాఠశాలలో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. పాఠశాల డైరెక్టర్ రామాగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నందిపేట్ పాలిటెక్నిక్ కళాశాలలో కూడా వేడుకలు నిర్వహించారు.

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి ప్రజ్ఞ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రోమావంశీ, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ శాంభవి హైస్కూల్‌లో బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. ఛైర్మన్ మధుసూదన్‌రాజ్, ప్రిన్సిపల్ ఇంద్రాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి ఉషాజ్యోతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడారు. అనంతరం నిమజ్జనం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు రూపశ్రీ, కార్యదర్శి గిరిబాబు, అన్వేష్, దశరథం, మహేష్, రవీందర్, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: వేంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మండల విద్యాధికారి రవికుమార్. ఎస్ఎంసీ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఎస్ఎంసీ సభ్యులు దినేశ్, నవీన్, చిన్నయ్య, సంజీవ్, దినేశ్, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

ఏర్గట్ల: మోర్తాడ్‌లోని కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు బతుకమ్మ ఆడారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


మోర్తాడ్‌లో..


బాల్కొండలో..


నందిపేట్‌లో..

ట్రాఫిక్ సిగ్నళ్ల పునరుద్ధరణ



ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నళ్లు పని చేయకపోవడంతో వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్తున్నాయి. ఈ విషయమై 'ఈనాడు'లో సెప్టెంబరు 29న 'మొరాయించిన సిగ్నళ్లు' అనే శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. బల్దియా అధికారులు స్పందించారు. మరమ్మతులు చేయించారు. వాటిని పునరుద్ధరించనట్లు బల్దియా కమిషనర్ రాజు సోమవారం తెలిపారు.

ఆవరణ అపరిశుభ్రం..దోమల వృద్ధికి ఆస్కారం


రూ.లక్షలు విలువచేసే యంత్రం చెత్త కుప్పలో..

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం చెబుతున్నారు. ఆర్మూర్ బల్దియా ఆవరణ మాత్రం పేరుకుపోతున్న పనికిరాని వస్తువులతో అధ్వానంగా మారింది. రూ.లక్షలు విలువ చేసే స్వీపింగ్ యంత్రం మూలకు చేరింది. ట్రాక్టర్, ట్రాలీలు, ఇతర వ్యర్థాలు అన్ని ఈ పరిసరాల్లో వేశారు. వాటిని స్క్రాప్ కింద సైతం అమ్మేసి ఆవరణను శుభ్రంగా మార్చాలని ఇక్కడకు వస్తున్న వారు కోరుతున్నారు. ఇదే ఆవరణలో నీరు నిల్వ ఉండి, దోమలు వృద్ధి చెందుతున్నాయి. –న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

గుంతలు తీసి.. నాటకుండా వదిలేసి..



ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయం నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతారని అనుకున్నారు. గుంతలు తీసి పెట్టారు. మొక్కలను సైతం తీసుకొచ్చి పక్కన పెట్టి, అందంగా అలంకరించారు. అతిథులు శిలాఫలకం ఆవిష్కరించి, కార్యాలయం ప్రారంభించి, అలాగే వెళ్లిపోవడంతో అక్కడున్న వారు అవాక్కయ్యారు. అనంతరం ఎక్సైజ్ సిబ్బంది మొక్కలను నాటారు.

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా నాగారంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో క్షత్రియ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారని ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహస్వామి తెలిపారు. అండర్ 16 బాలుర విభాగంలో జావెలిన్ త్రోలో అక్షయ్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అండర్ 14 బాలికల విభాగంలో లాంగ్ జంప్‌లో శైలజ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు పొందారన్నారు.


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు



భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్ పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఈనెల 29న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో భారత్ షోటో కాన్ ర్యూ కరాటే డూ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి లెవెల్ ఓపెన్ టూ ఆల్‌స్టైల్ కరాటే, కుంగ్‌ఫూ క్రీడల్లో కాటా విభాగం అండర్ 11 కేటగిరిలో పాఠశాలకు చెందిన జి.అజంతాప్రియ, కే.నవ్యశ్రీ, ఎస్.మోక్షిత, లాస్యశ్రీ, రసజ్ఞ, ప్రహర్షిత, కృతిక, బాలస్వామి, శ్రీహర్ష, రుష్విక్, హార్థిక్, మణికంఠ, చందూ, గౌరవ్‌లు బంగారు పతకాలు సాధించారు. వారిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. కరస్పాండెంట్ షఫీ, ఎండీ.సనా, ప్రిన్సిపల్ రాధాకృష్ణన్‌నాయర్, కరాటే శిక్షకుడు సురేష్‌కుమార్, ఏవో ప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సాధారణం

పోచంపాడ్(బాల్కొండ), న్యూస్‌టుడే: ఉద్యోగులకు పదవీ విరమణ సర్వసాధారణమని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్త, ఉద్యోగుల సంఘం ఐకాస జిల్లా కో కన్వీనర్, డీజీవో జిల్లా అధ్యక్షుడు అమృత్‌కుమార్, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ అన్నారు. శ్రీరామసాగర్ ప్రాజెక్టు కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా, టీఎన్‌జీవోఎస్ శ్రీరామసాగర్ ప్రాజెక్టు యూనిట్ అధ్యక్షుడిగా పని చేస్తున్న జాన్ సుభాకర్ సోమవారం పదవీ విరమణ పొందారు. దీంతో ఆయనను పోచంపాడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి టీఎన్‌జీవోఎస్ కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్, జాఫర్, సంజీవయ్య, జాకీర్ హుస్సేన్, పందిరి స్వామి పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ



చౌట్‌పల్లిలో..

చౌట్‌పల్లి(కమ్మర్‌పల్లి),న్యూస్‌టుడే: మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించడంతో చౌట్‌పల్లిలో ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఆంధ్రయ్య, పీఈటీ నాగేష్‌ను సన్మానించారు. కమల తదితరులు పాల్గొన్నారు.

కోనసముందర్(కమ్మర్‌పల్లి): ఎనిమిది షీల్డ్‌లు, కప్‌లు సాధించడంతో కోనసముందర్‌లో ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ధన్‌పాల్, పీఈటీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఈతో ఒప్పందం



ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం, ఐపీఈతో ఒప్పందం చేసుకొన్నట్లు ప్రిన్సిపల్ డా.వేణుప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు పరిశోధనకు సంబంధించి, సిలబస్‌లో మార్పులు, చేర్పులు, ఇంటర్న్‌షిప్‌లు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఒప్పంద కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డా. లింగన్న, ఐపీఈ ప్రతినిధులు డైరెక్టర్ ప్రొ.శ్రీనివాస మూర్తి, ప్రొ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పుర కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు మహిపాల్, నాయకులు ఉమేశ్, సుభాష్, నిశాంత్ పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణోత్సవం

నిజామాబాద్ సాంస్కృతికం: శంభునిగుడిలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. వేద పండితులు వేలేటి పశుపతిశర్మ నేతృత్వంలో అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి కన్యాదానం, కానుకలను సమర్పించారు.

సీపీని కలిసిన ఆర్మూర్ ఏసీపీ



ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం సీపీ కల్మేశ్వర్ సింగెనవార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రొటోకాల్ పాటించలేదని వాగ్వాదం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రొటోకాల్ పాటించలేదని కౌన్సిలర్లు, నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఫ్లెక్సీలో పుర ప్రజాప్రతినిధుల ఫొటోలు ఎందుకు లేవన్నారు. అదే సమయంలో అక్కడకు అతిథులు రావడంతో వివాదం సద్దుమణిగింది.

ఉచిత వైద్య శిబిరం

ఏర్గట్ల, న్యూస్‌టుడే: అనూరాధ పిల్లల ఆసుపత్రి మెట్‌పల్లి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నలంద పాఠశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. వైద్యుడు శ్రీనాథ్ గౌడ్, వివిధ గ్రామాలకు చెందిన సుమారు ఐదు వందల మందికి పైగా వైద్యపరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ రంగు వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



అవీ...ఇవీ.. అన్నీ

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆలూరు నూతన తహసీల్దార్ రమేశ్, ఎంఈవోను మా ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామచందర్, ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నాట్య గురువుకు..

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ పట్టణానికి చెందిన నాట్య గురువు మృణాళినికి డాక్టరేట్ రావడంతో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ ఆధ్వర్యంలో ఆమె సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు పోల్కం వేణు, జోన్ ఛైర్మన్ చేపూర్ గణేశ్, కార్యదర్శి సంతోష్, అశోక్, రామకృష్ణ, ప్రకాశ్, నసీర్, నాని, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంజులమ్మకు నివాళి

వేల్పూర్(కమ్మర్‌పల్లి): వేల్పూర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ సంవత్సరీకాన్ని సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్దన్, హన్మంత్‌షిండే, సురేందర్ హాజరై మంజులమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

భాజపా కార్యవర్గ సమావేశం

ఏర్గట్ల: భాజపా మండలాధ్యక్షుడు నారాయణ రెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఇందులో సభ్యత్వ నమోదు జిల్లా ప్రముఖ్ శివకుమార్, మండల ప్రధాన కార్యదర్శులు బద్దం సురేశ్, దాసరి రంజిత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గడ్డం శ్రీనివాస్, శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందజేత

ఏర్గట్ల: ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ శిక్షకులను ఎంపిక చేసి నిజామాబాద్‌లోని ఓ హోటల్‌లో శాలువాలతో సన్మానించి, ప్రశంసాపత్రాలు సోమవారం అందజేశారు. ఇందులో భాగంగా మండలంలోని తొర్తికి చెందిన పిరమిడ్ ధ్యానయోగ శిక్షకురాలు సల్ది దీప ఎంపికయ్యారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ సోను, ప్రముఖులు పాల్గొన్నారు.

లక్ష్మి కాలువ ఏఈఈ బదిలీ

ముప్కాల్,న్యూస్‌టుడే: శ్రీరామసాగర్‌లోని లక్ష్మి కాలువ ఏఈఈ పి.శేఖర్ బాబు సోమవారం ఖమ్మం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిగా లింబాద్రి నియమితులయ్యారు. ఆయన్ని నీటిపారుదల సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు.

ఇంజినీర్ల ఆందోళన



శ్రీరామసాగర్,. న్యూస్‌టుడే: రామగుండంలో నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పాదన కేంద్రాన్ని జెన్‌కో, సింగిరేణి భాగస్వామ్యంతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జెన్‌కోకు అప్పగించాలని కోరుతూ శ్రీరామసాగర్ ప్రాజెక్టు జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రం ప్రధాన గేటు వద్ద ఇంజినీర్లు, ఉద్యోగులు సోమవారం ఆందోళన నిర్వహించారు. జల విద్యుత్తు కేంద్రం ఐకాస నాయకులు రఫీక్, సతీష్, భరత్, సురేష్‌కుమార్, వేణుగోపాల్, చంద్రశేఖర్, ప్రవీణ్, తక్కన్న, వినోద్, నాగార్జున, రాందాస్, గంగారాం షిండే, ప్రణీత్, నిదీష్, హేమలత, గ్రీష్మ, మేఘన, స్వాతి, నవనీత, సింధూజ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ ఎంపీడీవోకు గాయాలు

ముప్కాల్, న్యూస్‌టుడే: ముప్కాల్ ఎంపీడీవో మహ్మద్ ముజఫరొద్దీన్ మండల కేంద్రంలో సోమవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. బస్సు దిగిన ఆయనను ద్విచక్రవాహనదారుడు ఢీ కొట్టాడు. గాయాలు కాగా.. స్థానికులు వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.